
సాక్షి
ఒడిశా
గురువారం । 26 । అక్టోబర్ । 2023


శ్రీమందిరం ఆదాయం లెక్కింపు
భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం బుధవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.4,72,955లు, బంగారం 5గ్రాము 650 మిల్లీగ్రాములు, వెండి 134 గ్రాములు 150 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.


కిసాన్ సభా కార్డుల పేరిట.. అనధికార వసూళ్లు
- 8లో


శిలగాం రోడ్డులో చైన్‌స్నాచింగ్
- 8లో

న్యూస్‌రీల్

దోపిడీ దొంగల ముఠా అరెస్టు


అరెస్టైన వ్యక్తులు, స్వాధీనం చేసుకున్న వస్తువులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: గంజాం జిల్లాలోని అస్కా పరిధి పురుషోత్తపూర్, పట్టపూర్, కబిసూర్యనగర్‌లో గత వారం రోజులుగా జరుగుతున్న దోపిడీల ఘటనలో ఐదుగురు నిందితులను పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి ఒక కత్తి, చాకు, సెల్‌ఫోన్లు, 2 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు రంబా పోలీసుస్టేషన్ ఐఐసీ అధికారి ప్రశాంత్ కుమార్ సాహు తెలియజేశారు. అరెస్టైన వ్యక్తుల్లో గంజాం జిల్లాకి చెందిన రమేష్ చంద్ర బారిక్, దీపక్ బారిక్, నిరంజన్ మహరణ, పప్పు బెహరా, స్వాధీన్ కుమార్ దాస్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

కంచి కామాక్షి ఉత్సవాలు ప్రారంభం


ప్రత్యేక అలంకరణలో కంచి కామాక్షి అమ్మవారు

పర్లాకిమిడి: స్థానిక ఉప్పరవీధిలో కంచి కామాక్షి ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతిఏటా పర్లాకిమిడి విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో దసరా మరుసటి రోజు నుంచి ఉత్సవాలు జరుపుతారు. మహిళలు పెద్ద ఎత్తున కంచి కామాక్షి అమ్మవారిని దర్శించుకొని కుంకుమ పూజలు నిర్వహించారు. ఆదివారం వరకు ఉత్సవాలు నిర్వహిస్తామని విశ్వ బ్రాహ్మణ సంఘం కమిటీ సభ్యుడు రవి తెలియజేశారు.

వారాంతపు సంతలో హత్యలు


సంతలో గుమిగూడిన ప్రజలు

జయపురం: కొరాపుట్ జిల్లా కుందిలి వారాంతపు సంతలో బుధవారం రెండు హత్యలు జరిగినట్లు తెలుస్తోంది. హత్యకు గురైనవారు రెండు కుటుంబాలకు చెందిన గోవర్ధన పెండిక, రాజకుమార్ రుడిలుగా గుర్తించారు. ముందుగా టిమ గ్రామానికి చెందిన గోవర్ధన పెండికను దుండగులు హత్య చేశారు. ఈ హత్యను గోకులు రుడి, అతడి కుమారుడు రాజకుమార్ రుడిలు చేసినట్లు గోవర్ధన పెండిక కుటుంబ సభ్యులు అనుమానించారు. దీంతో గోవర్ధన్ కుటుంబ సభ్యులు బంధువులు వచ్చి గోకుల రుడి కుమారుడు రాజకుమార్ రుడిని హత్య చేశారు. అయితే ఈ హత్యలకు గల కారణాలు తెలియలేదు. విషయం తెలిసిన పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఉమ్మిరిలో తుపాకీ కాల్పులు


తుపాకీ బులెట్లు

జయపురం: స్థానిక ఉమ్మిరి గ్రామంలో మంగళవారం రాత్రి 12 గంటల సమయంలో దసరా ఉత్సవాల వేళ తుపాకీ తూటాలు పేలాయి. ఈ ప్రాంతంలో పేరుమోసిన నేరస్తుడు రంజిత్ భాగ్ దసరా సందర్భంగా తుపాకీ పేల్చినట్లు జయపురం సదర్ పోలీసు వర్గాలు వెల్లడించాయి. దుండగుడు దాదాపు నాలుగు రౌండ్లు తుపాకీ కాల్పులు జరిపినట్లు పోలీసు అధికారి ఈశ్వర తండి వెల్లడించారు. పేలిన తూటాలలో కొన్నింటిని స్వాధీన పరచుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కాల్పులపై కేసు నమోదు చేశామని, నిందితుడిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, అతడు పరారయ్యాడని తెలియజేశారు. ఈ ఘటనతో ఉమ్మిరి ప్రాంతంలో భయాందోళన వాతావరణం ఏర్పడింది.


జయపురం: రావణ దహనం నిర్వహిస్తున్న దృశ్యం


జయపురం: రాజుగారి కోటకు వచ్చిన నందపూర్ దేవతా లారీలు, పూజారులు



బరంపురం: నిమజ్జనానికి తరలి వెళ్తున్న గిరి మార్కెట్ దుర్గామాత

వైభవం.. అమ్మవారి అనుపోత్సవం

రాష్ట్రవ్యాప్తంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా ముగిశాయి. దీంతో వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలను మేళతాళాలతో నిమజ్జనం జరిపారు. దసరా సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన సాంస్కృతి నృత్యాలు ఆకట్టుకున్నాయి.

– సాక్షి నెట్‌వర్క్



బరంపురం: గాంధీ నగర్ జంక్షన్‌లో...


బరంపురం: పాత బస్టాండ్‌లో...


బరంపురం: పెద్ద బజార్‌లో...


బరంపురం: హనుమాన్ బజార్‌లో...


బరంపురం: బీఎంసీ ఏర్పాటు చేసిన చెరువులో అమ్మవారి నిమజ్జనం నిర్వహిస్తున్న దృశ్యం


బరంపురం: శాంతి భద్రతలు పర్యవేక్షిస్తున్న పోలీసులు


పర్లాకిమిడి: పెద్ద బ్రాహ్మణ వీధిలో...


పర్లాకిమిడి: హైస్కూల్ జంక్షన్ వద్ద...


జయపురం: మా విజయను పల్లకిలో తీసుకెళ్తున్న భక్తులు


జయపురం: దసరా వేడుకలో జనసందోహం


జయపురం: ప్రజలతో ఎమ్మెల్యే బాహిణీపతి


జయపురం: సూర్య మహల్‌లో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

• నందెమ్మలు రెడీ




గజపతి జిల్లాలో ఖరీఫ్ పంట పచ్చగా కళకళలాడుతున్న వేళ, దసరా ఉత్సవాలు పూర్తయిన వారం రోజుల్లో వచ్చే కుమారి పౌర్ణమి లేదా నందెమ్మ ఉత్సవాలకు ప్రజలు సిద్ధమవుతున్నారు. ముఖ్యంగా పల్లెల్లో గౌరమ్మ మొక్కులు తీర్చుకునేందుకు నందమ్మ ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. ఈనెల 28వ తేదీన వచ్చే కుమారి పౌర్ణమి ఉత్సవాలకు స్థానిక కటికవీధి, చిత్రకార వీధిలో నందెమ్మ కొనుగోళ్లకు ఆర్డర్లు ఇస్తుండడం విశేషం.

- పర్లాకిమిడి

18 మంది పేకాటరాయుళ్లు అరెస్టు


ఛత్రపూర్‌లో అరెస్టు చేసిన వ్యక్తులను చూపిస్తున్న పోలీసులు


స్వాధీనం చేసుకున్న నగదు, సెల్‌ఫోన్లు, పేకముక్కలు


రంగునిబందా జంక్షన్‌లో అరెస్టైన పేకాటరాయుళ్లు

బరంపురం: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నడుస్తున్న జూదం అడ్డాలను నియంత్రించేందుకు ఎస్పీ సర్వాణ్ వివేక్ ఒక ప్రత్యేక పోలీసు అధికార బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బరంపురం పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో మంగళవారం అర్ధరాత్రి రహస్యంగా నడుస్తున్న జూదం అడ్డాలపై ప్రత్యేక పోలీసు బృందం అధికారులు దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా 18 మంది పేకాటరాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.1,65,547 నగదు, 18 మొబైల్స్ సీజ్ చేశారు.

మరో 17 మంది...

పర్లాకిమిడి: పట్టణ పరిసర ప్రాంతాల్లో నిర్వహిస్తున్న జూదం అడ్డాలపై పోలసులు దాడులు నిర్వహించి, 17 మందిని అరెస్టు చేసినట్లు ఐఐసీ ప్రశాంత్ భూపతి తెలియజేశారు. వారి వద్ద నుంచి రూ.38,350 నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

క్లుప్తంగా

జాబ్ మేళా రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 27న నెహ్రూ యువ కేంద్రంలో యకోమా ఆఫ్ హైవే ట్రైస్ సంస్థలో ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి పి.బి.సాయి శ్రీనివాస్ తెలిపారు. ఎచ్చెర్ల పారిశ్రామిక శిక్షణ కేంద్రంలోని స్కిల్ హబ్‌లో బుధవారం వివరాలు వెల్లడించారు. ఉదయం 9 నుంచి రిజిస్ట్రేషన్ ప్రారంభమవుతుందని చెప్పారు. డిప్లమా, డిగ్రీ విద్యార్హత ఉన్న 24 ఏళ్లలోపు మహిళా అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ప్రారంభంలో రూ.7 వేలు, రెండు నెలల తర్వాత కంపెనీ నిబంధనల మేరకు రూ.16,749 వేతనం అందజేయనున్నట్లు చెప్పారు. 5.3 అడుగుల ఎత్తు, 50 కిలోల బరువు ఉండాలన్నారు. పూర్తి వివరాలకు 9704960160, 8317652552, 9703460880 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఘనంగా ఆదిత్యుని కల్యాణం



కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

అరసవల్లి : ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి కల్యాణోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఆశ్వీయుజ శుద్ధ ఏకాదశి (మతత్రయ) సందర్భంగా ఉషా పద్మిని ఛాయా దేవేరులతో శ్రీవారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణమూర్తులుగా అనివేటి మండపంలో ఉంచారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఇప్పిలి సాందీప్ శర్మ ఆగమశాస్త్ర ప్రకారం కల్యాణం నిర్వహించారు. కల్యాణ సేవకు హాజరైన భక్త దంపతులకు శేషవస్త్రాలు, తలంబ్రాలు, తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అండర్-19 క్రీడాకారుల ఎంపికలు రేపు

ఎచ్చెర్ల క్యాంపస్: త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలకు సంబంధించి అండర్-19 బాల, బాలికల ఎంపికలు గురువారం నిర్వహించనున్నట్లు సమాఖ్య జిల్లా కార్యదర్శి, దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.రామన్న తెలిపారు. ఈ మేరకు బుధవారం వివరాలు వెల్లడించారు. దుప్పలవలస అంబేడ్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల మైదానంలో ఉదయం 10 గంటల నుంచి ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. రైఫిల్ షూటింగ్, బాస్కెట్ బాల్, ఫెన్సింగ్ క్రీడల్లో క్రీడాకారుల ఎంపిక ఉంటుందన్నారు. వివరాలకు 63025 46128 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

జేఎన్‌టీయూ ఈసీ మెంబర్‌గా రాజేష్



ఎచ్చెర్ల క్యాంపస్: టెక్కలి ఐతం ఇండస్ట్రీ రిలేషన్స్ హెడ్, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వపు ఈసీ మెంబర్ డాక్టర్ బుడుమూరు రాజేష్ విజయనగరం జేఎన్‌టీయూ (గురజాడ) విశ్వవిద్యాలయం పాలక మండలి సభ్యునిగా నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ శ్యామలరావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. రాజేష్ ప్రస్తుతం ఐతంలో ప్రొఫెసర్‌గా పరిచేస్తూ విద్యా ప్రగతికి తనవంతు సేవలు అందిస్తున్నారు. ఉపాధి కల్పనలో చేసిన కృషికి గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. జేఎన్‌టీయూ పాలక మండలి సభ్యునిగా మూడేళ్లు కొనసాగనున్నారు. ఎంపిక చేసిన అధికారులకు, ప్రభుత్వానికి రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధుడి మృతి

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు మృతిచెందినట్లు ఎస్‌ఐ బలివాడ గణేష్ తెలిపారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో పాతబస్టాండు అనుకొని ఉన్న షాపింగ్ కాంప్లెక్సు వద్ద ఓ వృద్ధుడు స్పృహ కోల్పోయి పడివుండటం చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి రిమ్స్‌కు తరలించగా వృద్ధుడు అప్పటికే మృతి చెందాడు. గుర్తింపుకార్డు ఆధారంగా బి.కోవి (65)గా గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: మండలంలోని కొండభీంపురం గ్రామానికి చెందిన బొడ్డ జడ్డెయ్య(53) పురుగుల మందు తాగి శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు టెక్కలి ఎస్‌ఐ ఎల్.రామకృష్ణ తెలిపారు. జడ్డెయ్య కుమార్తె నాలుగు నెలల కిందట గుంటూరులో మృతిచెందింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. ఈ నెల 21న కుమారుడు మందులు కొనుక్కోమని రూ.400 ఇవ్వగా ఆ డబ్బులతో మద్యం తాగి ఇంటికొచ్చి భార్య సీతమ్మతో గొడవపడ్డాడు. ఆమెను బెదిరించేందుకు పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితికి చేరుకున్న జడ్డెయ్యను టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఈ నెల 25న మృతిచెందాడు. భార్య సీతమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేదల గుండెలపై సంక్షేమ సంతకం

తాము అధికారంలోకి వస్తే బడుగు బలహీనవర్గాల సంక్షేమానికి పెద్దపీట వేస్తామంటూ గత పాలకులు ఊదరగొట్టారు. తీరా గద్దెనెక్కాక ఆ మాటే మర్చిపోయారు. పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలను పూర్తిగా విస్మరించారు. వారికి తీవ్ర అన్యాయం చేశారు. అయితే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం ఇచ్చిన మాటకే కట్టుబడ్డారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక దాదాపు 90 శాతం పదవులు, పథకాలను బడుగు, బలహీనవర్గాలకే కేటాయించారు. ఈ నాలుగున్నరేళ్లలో చేసిన సామాజిక న్యాయాన్ని, మంచిని ప్రజలకు వివరించేందుకు సామాజిక సాధికారత యాత్ర పేరిట గురువారం నుంచి బస్సు యాత్రకు శ్రీకారం చుట్టారు.



- 90 శాతం పథకాలు, పదవులు బడుగు, బలహీన వెనకబడిన వర్గాలకే
- సీఎం జగన్ చొరవతో సామాజిక సంక్షేమం, అభివృద్ధిలో దూసుకుపోతున్న శ్రీకాకుళం
- చేసిన మేలును వివరించేందుకు వైఎస్సార్ సీపీ సామాజిక సాధికారత బస్సుయాత్ర
- నేడు ఉత్తరాంధ్రలో ఇచ్ఛాపురం నుంచి శ్రీకారం
- యాత్రకు భారీగా తరలివస్తున్న జనం

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్ర కులాల పేదలకు పదవులు, సంక్షేమ పథకాలకు పెద్దపీట వేసినది జగన్ ప్రభుత్వమేనని రాష్ట్రమే కాదు దేశ వ్యాప్తంగా చెప్పుకుంటోంది. రాజ్యాధికారం, సామాజిక న్యాయం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. 85 శాతానికి పైగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సామాజిక వర్గాలున్నా గతంలో రాజ్యాధికారం దక్కేది కాదు. ఇప్పుడా పరిస్థితి లేదు. బడుగు, బలహీనవర్గాలకే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అగ్రతాంబూలం ఇస్తున్నారు. ఇప్పుడా విప్లవాన్ని వివరించే క్రమంలో నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ పేదవారందరినీ ఏకం చేసేందుకు, పేదవారికి జరిగిన మంచిని వివరించేందుకు జగన్నాథ రథచక్రాలు మన ముందుకు వస్తున్నాయి. పేదవాడికి, పెత్తందార్లకు మధ్య జరగబోతున్న యుద్ధంలో సామాజిక న్యాయం, సాధికారత గురించి వివరించేందుకు మీ బిడ్డ ప్రభుత్వమంటూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సామాజిక సాధికారత పేరుతో గురువారం ఇచ్ఛాపురం నుంచి బస్సు యాత్ర ప్రారంభిస్తోంది. మంచి చేసిన ప్రభుత్వాన్ని ఆదరిస్తూ మద్దతు పలికేందుకు ఇచ్ఛాపురం ప్రజలు సన్నద్ధమయ్యారు. యాత్రను విజయవంతం చేసేందుకు భారీగా జనం తరలివస్తున్నారు.

సంప్రదాయం కొనసాగిస్తూ..

ఇచ్ఛాపురం... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రతిపక్ష నేతగా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి తన పాదయాత్రను ముగించిన ప్రదేశమిది. నవ్యాంధ్రప్రదేశ్ తొలి విపక్ష నేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రకు ముగింపు పలికిన ప్రాంతమది. వీరిద్దరు ఎన్నికల్లో ఎటువంటి సంచలన విజయాలు సాధించారో అందరికీ తెలుసు. తూర్పు ప్రాంతంలో ఏ కార్యక్రమమైనా ముగింపైనా, ప్రారంభమైనా సెంటిమెంట్‌గా భావిస్తారు. ఈసారి కూడా ఇచ్ఛాపురం కేంద్రంగానే వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికారత బస్సు యాత్రకు శ్రీకారం చుడుతోంది. ఉత్తరాంధ్రలో ఇక్కడి నుంచే ప్రారంభిస్తూ ఈ ప్రాంతంపై ఉన్న అభిమానం, సెంటిమెంట్‌ను చాటుకుంటోంది.

బలహీన వర్గాలకే పట్టం..



జిల్లాలో తనను ఎన్నుకున్న ప్రజల కోసం, విశేష ఆదరణ చూపించిన బడుగు బలహీన వర్గాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు పనిచేస్తున్నారు. నాలుగేళ్ల పాలనలో ఏకంగా సామాజిక విప్లవాన్ని తీసుకొచ్చారు. రాష్ట్ర స్థాయి నుంచి పంచాయతీల వరకు అధికారాన్ని బలహీన వర్గాలకే అందించారు. పదవుల విషయంలోనే కాదు సంక్షేమ పథకాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, అగ్ర కులాల పేదలకే పెద్ద పీట వేశారు. ఇళ్ల పట్టాల పంపిణీలో 85శాతం వెనకబడిన వర్గాల వారికే ఇచ్చారు. వైఎస్సార్ నేతన్న నేస్తం, జగనన్న చేయూత, జగనన్న చేదోడు, మత్స్యకార భరోసా తదితర సంక్షేమ పథకాలను అందజేశారు. అదే విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

పట్టించుకోని టీడీపీ..

టీడీపీ బీసీలను కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకుందే తప్ప పాలనలో భాగస్వామ్యం చేయలేదు. సామాజికంగా, ఆర్థికంగా ఉన్నతస్థాయికి తీసుకొచ్చేందుకు ఎటువంటి ప్రయత్నం చేయలేదు. చంద్రబాబునాయుడు వాడుకుని వదిలేశారే తప్ప బడుగు, బలహీన వర్గాలకు చేసిందేమి లేదు. కార్పొరేషన్లు, నామినేటెడ్ పోస్టుల్లో కూడా బడుగులకు మొండి చేయి చూపారు. స్థానిక సంస్థల్లో పోటీ చేసే విషయంలోనూ వెనకబడిన వర్గాలపై చిన్నచూపు చూశారు.

జిల్లాలో వందల మందికి పదవులు..




ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ తరఫున గెలిచిన ఎనిమిది మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురు బీసీలే. మిగతా ఇద్దరిలో ఒకరు ఎస్టీ, మరొకరు ఎస్సీ. జిల్లాపై ప్రత్యేక ప్రేమ చూపిస్తూ వెనకబడిన వర్గాలకు చెందిన ముగ్గురు నేతలకు ఎమ్మెల్సీ పదవులు కేటాయించారు. వెనకబడిన వర్గాలకు చెందిన వారినే జెడ్పీ చైర్‌పర్సన్, జెడ్పీ వైస్ చైర్మన్లుగా నియమించారు. జిల్లాకు చెందిన ఏడుగురిని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్లుగా నియమించగా.. మరో మూడు కీలక స్టేట్ కార్పొరేషన్ చైర్మన్ పదవులు సైతం బీసీలకే అందించారు. జిల్లా స్థాయిలో డీసీసీబీ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, సుడా చైర్మన్ తదితర పోస్టులను వెనకబడిన వర్గాలకు కేటాయించగా.. మార్కెట్ కమిటీ, డైరెక్టర్ల పోస్టులను కూడా దాదాపు బడుగు, బలహీన వర్గాల వారికే కేటాయించారు.

వెనకబడిన వర్గాలకే అభివృద్ధి ఫలాలు...



రాష్ట్రంలో అత్యంత వెనకబడిన జిల్లాగా శ్రీకాకుళం ముద్ర వేసుకుంది. ఇప్పుడా పరిస్థితులు మారుతున్నాయి. అభివృద్ధి బాటలో జిల్లా పయనిస్తోంది. దీనికంతటికీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చూపిస్తున్న చొరవే కారణం. దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడంతో పాటు వెనుకబాటును పారద్రోలేందుకు కీలక ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారు. అత్యంత వెనకబడిన ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలను పట్టిపీడిస్తున్న కిడ్నీ మహమ్మారిపై యుద్ధం చేస్తున్నారు. దానిలో భాగంగా వంశధార‌ను అమృతధారలా మార్చి ఉద్దానం గొంతు తడిపేందుకు రూ.700 కోట్లతో భారీ మంచినీటి ప్రాజెక్టు నిర్మించారు. వ్యాధిని అదుపులోకి తెచ్చేందుకు ఏకంగా రూ.50 కోట్లతో కిడ్నీ రీసెర్చ్ కమ్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్మించారు.



- వంశధార శివారు ఆయకట్టుకు వెళ్లేందుకు గాను గొట్టా బ్యారేజీ వద్ద నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్‌కు పంపించేలా లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.176.35 కోట్ల వ్యయంతో చేపడుతున్న పనులు ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. 26 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, పలాస పట్టణానికి తాగునీరు అందించేందుకు మహేంద్ర తనయ వద్ద రూ.852.45 కోట్లతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టు పనులు చేస్తున్నారు.
- సాగర మాల ప్రాజెక్టులో భాగంగా మత్స్యకారుల సంక్షేమం దృష్ట్యా బుడగట్లపాలెం వద్ద రూ.365.81కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మిస్తున్నారు. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేటలో ప్రస్తుతం రూ.11.95 కోట్లతో నిర్మిస్తున్న జెట్టీ స్థానంలోనే ఫిషింగ్ హార్బర్ నిర్మించేందుకు సీఎం జగన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 
- శ్రీకాకుళం జిల్లా నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్‌లకు జల మార్గంలో అతి తక్కువ దూరం కలిగిన పోర్టు మరొకటి లేదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని మూలపేట వద్ద ల్యాండ్ లార్డ్ మోడల్ విధానంలో రూ. 2,949.70 కోట్లతో పోర్టు నిర్మిస్తున్నారు. 
- ఆమదాలవలస నియోజకవర్గం పొందూరు, తొగరాంలో డిగ్రీ కళాశాల, సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాల, వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్, తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల, బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు. నరసన్నపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తున్నారు. 
- ఆమదాలవలస మండలం ఇసుకలపేట వద్ద నాగావళి నదిపై జిల్లాకే దిక్సూచిగా మారిన బలసలరేవు బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం చురుగ్గా సాగుతున్నాయి. రెండు జిల్లాలను కలుపుతూ సులువుగా అతి తక్కువ దూరంలో చేరుకునేందుకు రూ. 87 కోట్లతో బ్రిడ్జి పనులు సాగుతున్నాయి. 
- పాతపట్నం నియోజకవర్గంలో ఐదు మండలాల ప్రజలకు తాగునీరు అందించేందుకు రూ.265 కోట్లు విడుదల చేశారు. 

ముమ్మరంగా ఏర్పాట్లు

ఇచ్ఛాపురం: పట్టణంలో గురువారం ప్రారంభం కానున్న సామాజిక సాధికారిత బస్సుయాత్రకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో బస్సు యాత్ర పరిశీలకులు లేళ్ల అప్పిరెడ్డి, నవరత్నాల ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఏ.ఎస్.మూర్తి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. యాత్రకు సుమారు 25వేల మంది హాజరయ్యే అవకాశమున్నందున ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసుల సహకారంతో చర్యలు తీసుకుంటున్నారు. జాతీయరహదారి-16 గుండా వచ్చే వాహనాలను బెల్లుపడ కూడలి, బాహుదానది పాతవంతెన మీదుగా వచ్చిన వాహనాలకు సురంగి రాజాక్రీడామైదానంలో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. ఒడిశా నుంచి వచ్చే ప్రయివేటు బస్సులు, వాహనాలను సుమండి రోడ్, ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టు మీదుగా దారి మళ్లించి పట్టణంలోని గ్యాస్ గొడౌన్ వరకు వచ్చి వెనుదిరుగుతాయి. ఆర్టీసీ బస్సులను బెల్లుపడ రోడ్ గుండా కాంప్లెక్సు వరకు వచ్చి వెనుదిరుగుతాయి. ఏర్పాట్ల పరిశీలనలో మారిటైం బోర్డు చైర్మన్ కాయల వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ నర్తు రామారావు, మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, కార్పొరేషన్ చైర్మన్లు సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, లోకేశ్వరరావు పాల్గొన్నారు.



ఇచ్ఛాపురం బస్టాండ్ కూడలిలో సిద్ధమైన బహిరంగ సభావేదిక

బీసీ కార్పొరేషన్లలో..

పేరాడ తిలక్	కాళింగ కార్పొరేషన్ చైర్మన్
అంధవరపు సూరిబాబు	కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్
మామిడి శ్రీకాంత్	తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్
దుక్క లోకేశ్వరరావు	రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్
పి.కృష్ణవేణి	పోలినాటి వెలమ కార్పొరేషన్ చైర్‌పర్సన్
రాజాపు హైమావతి	పొందర కార్పొరేషన్ చైర్‌పర్సన్
చీపురు రాణి	శ్రీశయన కార్పొరేషన్ చైర్‌పర్సన్

చట్టసభల్లోనూ బీసీ, ఎస్సీ, ఎస్టీలదే హవా



తమ్మినేని సీతారాం	స్పీకర్(కాళింగ)
ధర్మాన ప్రసాదరావు	మంత్రి (పోలినాటి వెలమ)
సీదిరి అప్పలరాజు	మంత్రి(మత్స్యకార)
పిరియా విజయ	జెడ్పీ చైర్‌పర్సన్(కాళింగ)
దువ్వాడ శ్రీనివాస్	ఎమ్మెల్సీ(కాళింగ)
పాలవలస విక్రాంత్	ఎమ్మెల్సీ(తూర్పు కాపు)
నర్తు రామారావు	ఎమ్మెల్సీ (యాదవ)
ధర్మాన కృష్ణదాస్	ఎమ్మెల్యే (పోలినాటి వెలమ)
రెడ్డి శాంతి	ఎమ్మెల్యే(తూర్పు కాపు)
గొర్లె కిరణ్‌కుమార్	ఎమ్మెల్యే(తూర్పు కాపు)
విశ్వసరాయి కళావతి	ఎమ్మెల్యే (ఎస్టీ)
కంబాల జోగులు	ఎమ్మెల్యే(ఎస్సీ)

నామినేటెడ్ పదవుల్లో..

బల్లాడ హేమమాలినిరెడ్డి	ఏపీ ఫైనాన్స్ మహిళా కార్పొరేషన్ సంస్థ చైర్‌పర్సన్
సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి	సీడాప్ చైర్మన్
కరిమి రాజేశ్వరరావు	డీసీసీబీ చైర్మన్
గొండు కృష్ణమూర్తి	డీసీఎంఎస్ చైర్మన్
కోరాడ ఆశాలత	సుడా చైర్‌పర్సన్
సువ్వారి సువర్ణ	గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్
పాలిన శ్రావణి	జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ (యాదవ)
సిరిపురపు జగన్మోహన్	జెడ్పీ వైస్ చైర్మన్ (తూర్పు కాపు)
పిలకా రాజలక్ష్మి	ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్‌పర్సన్(రెడ్డిక)
బల్ల గిరిబాబు	పలాస మున్సిపల్ చైర్మన్ (కాళింగ)

బస్సుయాత్ర షెడ్యూల్ ఇలా..

కంచిలి: ఇచ్ఛాపురంలో గురువారం జరగనున్న సామాజిక సాధికార యాత్ర షెడ్యూల్‌ను నియోజకవర్గ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ బుధవారం వెల్లడించారు.

- ఉదయం 10 నుంచి 11 గంటల వరకు శ్రీకాకుళం నగరంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సామాజిక సాధికారత యాత్రపై విలేకరుల సమావేశం.
- మధ్యాహ్నం 12.30 నుంచి 1.30 గంటల వరకు పలాస టి.కె.ఆర్. ఫంక్షన్ హాల్లో భోజన విరామం
- మధ్యాహ్నం 2.15 గంటలకు కంచిలి మండలం బూరగాంలో గ్రామ సచివాలయం, నాడు-నాడు పాఠశాల సందర్శన
- మధ్యాహ్నం 3-15 గంటలకు ఇచ్ఛాపురం పట్టణంలో సభా వేదిక వద్దకు చేరుకుని సభను ప్రారంభిస్తారు.
- ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్, మంత్రి బొత్స సత్యనారాయణ, మంత్రులు ధర్మాన ప్రసాదరావు, మేరుగ నాగార్జున, డాక్టర్ సీదిరి అప్పలరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, పార్టీ నాయకులు పాల్గొంటారు.

కిసాన్ సభా కార్డుల పేరిట..

అనధికార వసూళ్లు

- ఒక్కో రైతు నుంచి రిజిస్ట్రేషన్ చార్జి పేరిట రూ.250 వసూలు
- కోటబొమ్మాళి మండలంలో వెయ్యికార్డుల జారీ
- ప్రైవేటు ఏజెన్సీ ప్రతినిధులపై పోలీసులకు ఫిర్యాదు చేసిన వ్యవసాయాధికారులు



చీపుర్లపాడు ఆర్‌బీకేలో కిసాన్ సభా కార్డులకు ఆన్‌లైన్ చేస్తున్న ప్రవేటు ఏజెన్సీకి చెందిన మహిళలు

కోటబొమ్మాళి: కేంద్ర ప్రభుత్వం వాణిజ్య పంటలను పండించే రైతులకు అందించే కిసాన్ సభా కార్డుల జారీ పేరిట డబ్బులు వసూలు చేయడం స్థానికంగా కలకలం రేపింది. ఓ ప్రైవేటు ఏజెన్సీకి చెందిన ముగ్గురు మహిళలు తమను వ్యవసాయాధికారులు పంపించారని చెబుతూ గ్రామాల్లో ప్రచారం చేశారు. కోటబొమ్మాళి మండలంలోని దంత, కురుడు, ఎలమంచిలి, చీపుర్లపాడు, సరియాపల్లి, కొత్తపల్లి తదితర 8 పంచాయతీల్లో రైతులకు కిసాన్ సభా కార్డులు పంపిణీ చేశారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ పేరిట ఒక్కొక్కరి నుంచి రూ.250 వసూలు చేశారు. మండల వ్యాప్తంగా దాదాపు వెయ్యి మందికి కార్డులు ఇచ్చినట్లు సమాచారం. దీనిపై కొందరు రైతులకు అనుమానం వచ్చి ప్రశ్నిస్తే.. తమకు వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్, కోటబొమ్మాళి ఏఓ గోవిందరావు అనుమతులు ఇచ్చారని ఆ మహిళలు చెప్పడం గమనార్హం. చీపుర్లపాడు సచివాలయంలోని ఆర్‌బీకే కార్యాలయంలో సోమవారం కార్డుల జారీ కార్యక్రమం చేపట్టారు. దీంతో కొందరు రైతులు ఏఓకు ఫిర్యాదు చేయడంతో ఈ ఉదంతం బయటపడింది.

అనుమతి ఇవ్వలేదు

ఈ అంశంపై వ్యవసాయ శాఖ జేడీ శ్రీధర్‌ను 'సాక్షి' వివరణ కోరగా కిసాన్ సభా కార్డులజారీకి ఇప్పటివరకూ ఏ ఒక్క ఏజెన్సీకి తాము అనుమతి ఇవ్వలేదని, కోటబొమ్మాళి మండలంలో కార్డులు ఇస్తున్న ఏజెన్సీ ప్రతినిధులపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వ్యవసాయాధికారుల పేర్లు చెప్పి వసూళ్లకు పాల్పడుతున్న ఏజెన్సీ ప్రతినిధులపై చర్యలు తీసుకోవాలని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశామని కోటబొమ్మాళి ఏఓ ఎస్.గోవిందరావు పేర్కొన్నారు.

విచారణ చేయాలి



కిసాన్ సభా కార్డు ద్వారా రైతులకు రుణాలు, సబ్సిడీలు వస్తాయని ఏజెన్సీ సభ్యులు చెప్పారు. ఆ మేరకు నేను రూ.250 చెల్లించి కార్డు తీసుకున్నాను. తీరా ఇప్పుడు ఈ కార్డు వల్ల సన్నకారు రైతులకు ఎలాంటి మేలు ఉండదంటున్నారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ చేసి రైతులకు న్యాయం చేయాలి.

– హనుమంతు ఆనందరావు, ఊడికిలపాడు గ్రామం, కోటబొమ్మాళి మండలం

ప్రచారం చేశారు



కిసాన్ సభా కార్డు తీసుకుంటే రైతులకు మేలు జరుగుతుందని మైకెసెట్‌లో ప్రచారం చేశారు. వ్యవసాయ పనిముట్లు, రుణాలు, విత్తనాలు రాయితీపై వస్తాయని చెప్పారు. దీంతో రూ.250 చెల్లించి కార్డు తీసుకున్నాను. ఈ కార్డు వ్యవసాయాధికారులకు తెలియకుండా జారీ చేశారని తెలిసింది. దీనిపై వాస్తవాలు తేల్చాలి.

– నేతింటి శ్రీను, చీపుర్లపాడు గ్రామం, కోటబొమ్మాళి మండలం

నేటి నుంచి ఆర్టీసీ డోర్ డెలివరీ మాసోత్సవాలు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు, సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్: ఆర్టీసీ డోర్ డెలివరీ సదుపాయాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రీకాకుళం ఒకటి, రెండు డిపోల మేనేజర్లు పి.మల్లికార్జునరాజు, కె.ఆర్.ఎస్.శర్మ పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలోని ఆర్టీసీ లాజిస్టిక్ పార్సిల్ కేంద్రం వద్ద బుధవారం డోర్ డెలివరీ ప్రచార మాసోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 26 నుంచి నవంబరు 25 వరకూ డోర్ డెలివరీపై ప్రయాణికులకు, వ్యాపారులకు, ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ కార్గో విభాగంలో రాష్ట్రవ్యాప్తంగా 90 ముఖ్య పట్టణాలలో 2021 సెప్టెంబరు 1న డోర్ డెలివరీ ప్రారంభించినట్లు చెప్పారు. డిపో పరిధిలో 10 కిలోమీటర్లు విస్తీర్ణం వరకూ 50 కేజీల వరకు సరుకులను డెలివరీ చేస్తామన్నారు. పార్శిల్స్, కొరియర్స్‌కు కేజీ వరకూ రూ.18, ఒక కేజీ నుంచి 6 కేజీల వరకూ రూ.30, ఆరు నుంచి 10 కేజీల వరకూ రూ.36, పది నుంచి 25 కేజీల వరకూ రూ.48, పాతిక కేజీల నుంచి రూ.50 కేజీల వరకూ రూ.59 చార్జీ వసూలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్లు వి.రమేష్, ఎ.గంగరాజు, డీఎంఈ ఇజాజ్, టీఐ-3 ఎల్.ఎస్. నాయుడు, సూపర్‌వైజర్లు, కండక్టర్లు, డ్రైవర్లు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

శిలగాం రోడ్డులో చైన్‌స్నాచింగ్

- మూడు తులాల పుస్తెలతాడు, రూ.2 నగదు చోరీ



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రాము, సిబ్బంది

కవిటి: మండలంలోని శిలగాం రోడ్డులో బుధవారం మధ్యాహ్నం ద్విచక్రవాహనంపై వస్తున్న మహిళను వెంబడించి పుస్తెలతాడు, బ్యాగును గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటనకు సంబంధించి కవిటి పోలీసులు విలేకరులకు వివరాలు వెల్లడించారు. దసరా సెలవుల అనంతరం పాఠశాల తెరవడంతో కవిటి మండలం బింగిపుట్టుగకు చెందిన బింగి లత తన చిన్న కొడుకును స్కూటీపై పలాసలోని సత్యసాయి పాఠశాలకు తీసుకెళ్లింది. తిరిగి తన ఇంటికి వస్తుండగా ఇంటెనుకపుట్టుగ జంక్షన్ సమీపంలో శిలగాం రోడ్డుకు వచ్చేసరికి వెనకవైపు నుంచి ద్విచక్రవాహనంపై ఇద్దరు వ్యక్తులు ఓవర్‌టేక్ చేశారు. కొంతదూరం వెళ్లాకస్కూటీకి అడ్డంగా ఆపేశారు. దీంతో ఆందోళనకు గురైన లత స్కూటీని అదుపుచేసే క్రమంలో కిందపడిపోయింది. హెల్మెట్ ధరించి వెనక కూర్చొన్న వ్యక్తి దాడికి దిగి మూడుతులాల బంగారం పుస్తెలతాడు, హేండ్‌బ్యాగ్, అందులో ఉన్న మొబైల్‌ఫోన్, రూ.2000 నగదు, రెండు ఏటీఎం కార్డుల్ని అపహరించుకుపోయారు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కవిటి ఎస్‌ఐ కె.రాము సిబ్బందితో కలిసి ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

జల్‌జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేయాలి

• కలెక్టర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

విజయనగరం అర్బన్: జల్‌జీవన్ మిషన్ పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. జేజేఎం, జీజీఎంపీ ఇతర అభివృద్ధి పనులపై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లతో బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఈ మేరకు కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లాలోని వివిధ మండలాల్లో జరిగిన పనుల పురోగతిని ఆ శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ బి.ఉమా శంకర్ కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జేజేఎం పనులను త్వరగా పూర్తి చేసి, ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీటిని అందజేయాలని ఆదేశించారు. ఇంకా టెండర్లు ఖరారు కానిచోట, త్వరగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. గడ పగడపకు మన ప్రభుత్వం కింద పనులను పూర్తి చేసిన వెంటనే బిల్లులు అప్‌లోడ్ చేయాలన్నారు. జగనన్న కాలనీలో 50 శాతం ఇళ్ల నిర్మాణం పూర్తయిన చోట తక్షణమే తాగునీరు సరఫరా చేయాలని, అందుకోసం వెంటనే చర్యలు ప్రారంభించాలని చెప్పారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ విదాయసుందర రాజన్, డీఈలు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న మధుసూదనరావు

పార్వతీపురంటౌన్ /సీతానగరం: సీతానగరం మండలం చినభోగిలి గ్రామానికి చెందిన కల్యంపూడి మధుసూదనరావు గడ్డి మందు తాగి బుధవారం ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ సంఘటనపై జిల్లా ఆస్పత్రి అవుట్ పోస్టు పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మధుసూదన రావు ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. తాను సొంత ఇల్లు కట్టించాలని కోరుకున్నప్పటికీ సరిపడా డబ్బులు సమకూర్చలేకపోయాడు. ఇల్లు కట్టగలనో? లేదో? అని మనస్తాపం చెంది తీవ్ర ఆందోళనకు గురై గడ్డి మందు తాగేశాడు. ఈ విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు ఆటోలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మొబైల్ షాపులో చోరీ

విజయనగరం క్రైమ్: గుర్తు తెలియని వ్యక్తి మొబైల్ షాపులో చొరబడి మొబైల్స్, చిన్నపాటి సెల్ పరికరాలు, బంగారు ఆభరణాల చోరీకి పాల్పడ్డాడు. ఈ మేరకు బుధవారం వన్‌టౌన్ ఎస్సై అశోక్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని రైల్వేస్టేషన్ రోడ్డులో ఉన్న రాజ్ మొబైల్స్‌లో మంగళవారం పూజలు నిర్వహించిన అనంతరం షాపు మూసేసి సంబంధిత షాప్ యజమానులు ఇంటికి వెళ్లిపోయారు. గురువారం ఉదయం వచ్చి షాపు తలుపు తెరిచి చూసేసరికి షాపు క్యాష్ కౌంటర్‌లో ఉంచిన బంగారు పుస్తెల తాడు, రింగుతో పాటు సెల్‌ఫోన్స్, యాక్సెసరీస్ కనిపించకుండా పోయాయి. దీంతో బాధితుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటీ కాల్చిన ఘటనలో కేసునమోదు

రాజాం సిటీ: స్థానిక చిన్నచెరువు గట్టు వీధిలో ఈ నెల 24న అర్ధరాత్రి స్కూటీ కాల్చిన ఘటనపై కేసునమోదుచేశామని ఎస్సై వై.రవికిరణ్ బుధవారం తెలిపారు. చిన్నచెరువు గట్టువీధికి చెందిన మహిళ దమరసింగి నారాయణ స్కూటీని పాతకక్షల నేపథ్యంలో సారధి గ్రామానికి చెందిన కిలారి త్రినాథ్ పెట్రోల్ పోసి కాల్చివేయడంతో పాక్షికంగా కాలిపోయింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

హోరాహోరీగా..

విజయనగరం: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన స్విమ్మింగ్, హకీ పోటీలు హోరాహోరీగా సాగాయి. నగరంలోని రెండు వేదికల్లో నిర్వహించిన పోటీల్లో తలపడిన క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించారు. కంటోన్మెంట్ ప్రాంతంలోని ఆక్వా స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో సుమారు 60 మంది క్రీడాకారులు పాల్గొనగా.... 50 మీటర్ల పొడవున ఫ్రీ, బ్యాక్‌స్టైల్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలుగా నిలిచిన 12 మంది క్రీడాకారులకు సెట్విజ్ సీఈఓ బి.రామ్‌గోపాల్, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్.వి.రమణ, స్విమ్మింగ్ కోచ్‌లు బహుమతులు ప్రదానం చేశారు. రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో నిర్వహించిన హకీ పోటీలకు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 5 జట్లు పాల్గొనగా.. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్రీడాకారులు హోరా.. హోరీగా తలపడ్డారు. పోటీలను జిల్లా క్రీడాప్రాధికార సంస్థ కోచ్‌లు, వ్యాయామ ఉపాధ్యాయులు పర్యవేక్షించారు.

ఉపాధిలో జవాబుదారీతనం

• అందుబాటులోకి జన్మన్ రేగ యాప్
• వేతనదారులు చేసిన పని తెలుసుకునే వెసులుబాటు
• ఆధార్ అనుసంధానమైన వారి వివరాలు లభ్యం



జన్మన్‌రేగ యాప్



ఉపాధి హామీ పథకంలో పనులు చేస్తున్న వేతనదారులు(ఫైల్)

విజయనగరం ఫోర్ట్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జవాబుదారీతనం, పారదర్శకతను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఉపాధి పథకం ద్వారా ఏటా కోట్లాది రుపాయల విలువ చేసే పనులు చేపడతారు. ఈ పథకంలో పూర్తిస్థాయిలో పర్యవేక్షణ లేకపోతే సిబ్బంది అవకతవకలకు పాల్పడే ఆస్కారం ఉంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం జన్మన్‌రేగ అనే యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈయాప్ వల్ల అనేక ఉపయోగాలు ఉన్నాయి. పనుల పర్యవేక్షణతో పాటు, ఉపాధి పథకానికి సంబంధించి సమస్త సమాచారాన్ని తెలుసుకోవడానికి అవకాశం ఉంటుంది. వేతనదారులు చేస్తున్న పనిని ఉపాధి హామీ అధికారులు శతశాతం నమోదు చేస్తున్నారా? లేదా పక్షపాత వైఖరి అవలంబిస్తున్నారా? అనేది తెలుసుకునే వీలుంటుంది.

జిల్లాలో వేతనదారులు 6. 87 లక్షల మంది

జాతీయ గ్రామీణ ఉపాధి పథకానికి సంబంధించి జిల్లాలో 3.81 జాబ్‌కార్డులు ఉన్నాయి. వాటిలో యాక్టివ్‌జాబ్ కార్డులు 3.49 లక్షలు కాగా 6. 87 లక్షల మంది వేతనదారులు ఉన్నారు. అందులో యాక్టివ్ వేతనదారులు 6.03 లక్షల మంది ఉన్నారు. ఉపాధి హామీ పథకంలో పనిచేసే వేతనదారులకు ఏడాదికి 1.92 కోట్ల పనిదినాలు కల్పిస్తారు. ఇందుకు గాను ప్రభుత్వం రూ. 400 కోట్ల వరకు వేతనాల రూపంలో ఖర్చు చేస్తుంది.

జన్మన్‌రేగ యాప్‌ద్వారా పర్యవేక్షణ

ఉపాధిహామీ పథకం ద్వారా చెరువుల్లో పూడిక తీత, చెరువులు లోతు చేయడం, అమృత్ సరోవర్ పథకానికి ఎంపికైన కొత్త చెరువుల తవ్వకం, మొక్కలు నాటడం, ట్రెంచ్ కటింగ్, రింగ్ కటింగ్, చెత్తనుంచి సంపద తయారీ కేంద్రానికి అప్రోచ్ రోడ్, ఉద్యాన పంటల సాగులో భాగంగా మొక్కలు నాటడానికి అవసరమైన గోతులు తవ్వడం, ఫిట్ చేయడం, గ్రావెల్ రోడ్లు, కల్వర్టులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, కందకాలు, ఫారంపాండ్స్ తవ్వడం వంటి పనులు చేపడతారు. ఈ పనులు చేపట్టే ముందు జియో ట్యాగ్ చేస్తారు. దీని వల్ల ఆ వివరాలు యాప్‌లోకి వస్తాయి. పర్యవేక్షణ సులభతరం అవుతుంది.

యాప్‌తో ప్రయోజనాలు అధికం

జన్మన్‌రేగ యాప్ వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వేతనదారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు, ఉపాధి హామీ సిబ్బంది యాప్ డౌన్‌లోడ్ చేసుకునేలా చర్యలు తీసుకుంటాం. ఈ యాప్ వల్ల పనుల పర్యవేక్షణ సులభతరమై జవాబుదారీ తనం, పారదర్శకత పెరుగుతుంది.

– జి. ఉమాపరమేశ్వరి, డ్వామాపీడీ

యాప్ వల్ల ఉపయోగాలు

వేతనదారులు జాబు కార్డు సంఖ్యను ఉపయోగించి వారు చేసిన పనిదినాలు, హాజరు, పొందిన వేతనం వివరాలు తెలుసుకోవచ్చు. జాబు కార్డులో ఉన్న వారిలో ఎవరెవరి పేర్లకు ఆధార్ నంబర్ అనుసంధానమైందో తెలుసుకోవచ్చు. యాప్‌లో పేరు, వివరాలతో రిజిస్టర్ అయినవారు, పనులపై వారి అభిప్రాయాలను తెలియజేయవచ్చు.

29, 30 తేదీల్లో ఉత్తరాంధ్ర వాలీబాల్ పోటీలు

• విజేతలకు నగదు బహుమతులు
• జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ కనకల కృష్ణ



వివరాలు వెల్లడిస్తున్న జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ కనకల కృష్ణ

విజయనగరం: ప్రతి ఏటా వైభవంగా నిర్వహించే విజయనగరం ప్రజల ఇలవేల్పు పైడితల్లమ్మవారి జాతర, విజయనగరం ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 29,30 తేదీల్లో ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా వాలీబాల్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్ కనకల కృష్ణ వెల్లడించారు. ఈ మేరకు పోటీలు నిర్వహించే రాజీవ్ క్రీడా మైదానంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి టీవీ.భగవాన్‌దాస్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన తండ్రి కనకల ఎర్రయ్య జ్ఞాపకార్థం రాజీవ్ క్రీడామైదానం వేదికగా ఫ్లడ్‌లైట్ల వెలుగులో పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ పోటీలకు తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, శ్రీకాకుళం, విజయనగరం, భోగాపురం, ఎస్‌కే అకాడమీ కొత్తవలస జట్లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. పోటీల్లో విజేతగా నిలిచిన జట్టుకు రూ.20,000, ద్వితీయ స్థానం దక్కించుకున్న జట్టుకు రూ.15,000, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.10,000, నాల్గవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.5,000 నగదు బహుమతి ఇవ్వనున్నట్లు చెప్పారు. అంతేకాకుండా పోటీలకు హాజరయ్యే జట్లకు రూ.6వేలు విలువ చేసే క్రీడాదుస్తులు అందజేస్తామన్నారు. రెండు రోజుల పాటు జరిగే పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తామన్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే పోటీలను విజయవంతం చేయాలని క్రీడాకారులు, క్రీడాభిమానులను కోరారు. సమావేశంలో జిల్లా వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

• నవంబర్ 4 నుంచి 9వరకు శ్రీనగర్‌లో సాఫ్ట్‌బాల్ పోటీలు
• రాష్ట్ర జట్టులో ఆరుగురికి స్థానం



జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు

తెర్లాం: జాతీయ స్థాయిలో జరగనున్న 10వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు బాలురు, బాలికల విభాగాల్లో జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. జాతీయ స్థాయి పోటీలు వచ్చే నెల 4 నుంచి 9 వరకు జమ్ము,కశ్మీర్ రాష్ట్రంలోని శ్రీనగర్‌లో జరగనున్నాయి. ఇటీవల నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో రాష్ట్రస్థాయి 10వ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లాకు చెందిన బాలికల జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని, బాలుర జట్టు తృతీయ స్థానాలను కైవసం చేసుకున్న విషయం తెలిసిందే. రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఆరుగురు జిల్లా క్రీడాకారులను జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర జట్లకు సాఫ్ట్‌బాల్ రాష్ట్ర అసోసియేషన్ ఎంపిక చేసింది. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వారిలో బాలికల విభాగంలో దుర్గాయమున, సాయి, మౌనిక, లావణ్య, బాలుర విభాగంలో ఎం.దుర్గాప్రసాద్, పి.శివ ఉన్నారు. ఎంపికైన ఆరుగురు క్రీడాకారులు తెర్లాం మండలానికి చెందిన వారు కావడం విశేషం. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు, పలువురు పీడీలు, పీఈటీలు అభినందనలు తెలియజేశారు.

పోలీసు అమరుల త్యాగం వృథా కారాదు



షేక్ ఇస్మాయిల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు, తదితరులు

• డీఎస్పీ ఆర్.గోవిందరావు

విజయనగరం క్రైమ్: జిల్లా పోలీసు శాఖలో పనిచేసి, సమాజంలో శాంతిని నెలకొల్పడంలో భాగంగా విధి నిర్వహణలో మావోయిస్టులతో పోరాడి మృతిచెందిన అమరవీరుల కుటుంబాల నివాస గృహాలను, వారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలను పోలీసు అధికారులు, సిబ్బంది బుధవారం సందర్శించారు. ఎస్పీ ఎం.దీపిక ఆదేశాల మేరకు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, వన్‌టౌన్ సీఐ బి.వెంకటరావు, టూటౌన్ సీఐ ఎస్.హెచ్.విజయ ఆనంద్, ఎస్.కోట సీఐ ఎస్.బాలసూర్యారావు, ఇతర పోలీసు అధికారులు, పోలీస్ అమరులు షేక్ ఇస్మాయిల్, చిట్టిపంతుల చిరంజీవిరావు ఇళ్లను, వారు విద్యాభ్యాసం చేసిన పాఠశాలలను బుధవారం సందర్శించారు. పాఠశాలల్లో విద్యార్థులతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా విజయనగరం డీఎస్పీ ఆర్.గోవింద రావు మాట్లాడుతూ మావోయిస్టుల దాడిలో మృతిచెందిన అమరవీరుడు షేక్ ఇస్మాయిల్ కస్బా హైస్కూల్‌లో చదువుకున్నారన్నారు. 2001 ఫిబ్రవరి 1న కురుపాం మండలం లోవలక్ష్మీపురం గ్రామ శివారులో ఒక కానిస్టేబుల్‌ను మావోయిస్టులు గాయపర్చి, అతని వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ సంఘటన జరిగిన తర్వాత పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘటనా స్థలానికి పోలీసుబృందాన్ని తీసుకుని, వాహనంలో వెళ్తుండగా మావోయిస్టులు మాటువేసి, మందుపాతర పేల్చడంతో పోలీస్ వాహనానికి డ్రైవర్‌గా ఉన్న షేక్ ఇస్మాయిల్‌తో పాటు 1993 బ్యాచ్ కానిస్టేబుల్ బి.శ్రీరాములు కూడా తీవ్రంగా గాయపడి సంఘటనా స్థలంలోనే మరణించారని గుర్తు చేశారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన షేక్ ఇస్మాయిల్ చరిత్ర రాబోయే తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో కస్బాహైస్కూల్‌ను సందర్శించామన్నారు. ఈ సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించారు.

కొట్టాంలో జెడ్పీ హైస్కూల్ సందర్శన

అదేవిధంగా ఎస్.కోట మండలం కొట్టాం జెడ్పీ హైస్కూల్‌ను డీఎస్పీ సందర్శించారు. గ్రామానికి చెందిన చిట్టిపంతుల చిరంజీవిరావు సాలూరు పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఇన్‌స్పెక్టర్ ముద్దాడ గాంధీకి అంగరక్షకుడిగా వ్యవహరించేవారు. 2001నవంబరు 28న సాలూరు న్యాయస్థానంలో ఒక కేసుకు సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు వెళ్లిన గాంధీతో పాటు ఆయన అంగరక్షకుడిగా వెళ్లిన చిరంజీవిరావుపైనా మావోయిస్టులు కిరాతకంగా కాల్పులు జరపడంతో వారిద్దరూ అక్కడికక్కడే మృతిచెందారన్నారు. ఈ సందర్భంగా అమరవీరులు పోలీస్‌శాఖకు చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు భాస్కరరావు, షేక్ శంకర్, జె.తారకేశ్వరరావు పాల్గొన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

బొబ్బిలి: పట్టణంలోని ఫ్లైఓవర్ వద్ద కారు ఢీకొన్న ప్రమాదంలో మహరాణి పేటకు చెందిన సీతంనాయుడు బుధవారం గాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని వెంటనే అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందజేస్తున్నారు.

దాడితల్లికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న పురోహితులు

బొబ్బిలి: గొల్లపల్లి బైపాస్ రోడ్డులో ఉన్న దాడితల్లి ఆలయంలో భక్తులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు పిండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి 108 లీటర్ల పాలతో అభిషేకం జరిపారు. తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

మెంటాడ పీహెచ్‌సీ సిబ్బందికి షోకాజ్ నోటీసులు

విజయనగరం ఫోర్ట్: విధుల్లో అలసత్వం వహిస్తున్న మెంటాడ పీహెచ్‌సీ సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) డాక్టర్ ఎస్. భాస్కరరావు షోకాజ్ నోటీసులు జారీచేశారు. కొద్దిరోజుల కిందట పీహెచ్‌సీని డీఎంహెచ్‌ఓ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆ సమయంలో వైద్య సిబ్బంది విధులకు డుమ్మా కొట్టారు. విధుల్లో లేని ఇద్దరు వైద్యులు, ఇద్దరు స్టాఫ్ నర్సులు, ఒక సీనియర్ అసిస్టెంట్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వారు ఇచ్చిన వివరణ ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని అందులో పేర్కొన్నారు.

నేటి నుంచి ఈ-క్రాప్ నమోదుపై సామాజిక తనిఖీ

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో 3,61,540 ఎకరాల్లో వరి పంట సాగైందని, దీనికి ఈ-క్రాప్ కూడా పూర్తయిందని జిల్లా వ్యవసాయ అధికారి వి.తారకరామారావు తెలిపారు. ఈ-క్రాప్ నమోదుకు సంబంధించి ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు అన్ని రైతు భరోసాకేంద్రాల వద్ద సామాజిక తనిఖీకోసం జాబితాల ప్రదర్శన, గ్రామ సభలు నిర్వహిస్తామని చెప్పారు. ఏవైనా అభ్యంతరాలుంటే గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు.

తోటపల్లిలో పవిత్రోత్సవాలు



స్వామివారికి దీక్షా వస్త్రాలను సమర్పిస్తున్న ఆలయ చైర్మన్ సత్యనారాయణ తదితరులు

గరుగుబిల్లి: తోటపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో బుధవారం పవిత్రోత్సవాలు ప్రారంభమైన సందర్భంగా అర్చకుడు వీవీ.అప్పలాచార్యులు స్వామివారికి, పద్మావతి అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతసేవ తదితర పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి తిరువీధి మహోత్సవం జరిపించారు. పవిత్రోత్సవాలలో భాగంగా దేవస్థాన చైర్మన్ మర్రాపు సత్యనారాయణ మంగళ వాయిద్యాల నడుమ స్వామివారికి దీక్షావస్త్రాలు, పూజాసామగ్రిని సమర్పించారు. పవిత్రోత్సవాల్లో భాగంగా స్వామివారికి విశేషహోమాలు, మండల రచన, పవిత్రమాలికలు, పతాకావిష్కరణ,ధ్వజారోహణం తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు, అర్చనల్లో పాల్గొన్నారు.

27, 30 తేదీల్లో స్కూల్ గేమ్స్ జిల్లా జట్ల ఎంపిక

• స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–14,17 స్కూల్‌గేమ్స్ క్రీడా పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 27, 30 తేదీల్లో నిర్వహించనున్నట్లు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్‌వీ రమణ బుధవారం తెలిపారు. ఈనెల 27న నగర శివారులో గల విజ్జి స్టేడియం ప్రాంగణంలో ఫుట్‌బాల్ బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. అలాగే 30న గజపతినగరంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బాల్‌బాడ్మింటన్ విభాగంలో బాల, బాలికల జిల్లా జట్ల ఎంపిక నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఎంపిక పోటీల్లో ప్రస్తుతం పాఠశాల విద్యనభ్యసిస్తూ నిర్ణీత వయస్సు కలిగిన క్రీడాకారులు పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. ఆయా రోజుల్లో జరిగే ఎంపిక పోటీల్లో జిల్లా జట్టుకు అర్హత సాధించే క్రీడాకారులు త్వరలో రాష్ట్రస్థాయిలో జరగనున్న అంతర్‌జిల్లాల పోటీలకు జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతలకు అభినందన



పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

విజయనగరం: విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బాడీబిల్డింగ్ పోటీల్లో విజేతలను జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రెడ్డి.శంకరరావు, కోరాడ.శ్రీనివాసరావులు బుధవారం అభినందించారు. విజయనగరంలో నిర్వహించిన పోటీల్లో టి.అప్పలరాజు, కె.విజయ్, కె.కిరణ్‌లు మొదటి స్థానం, ఎస్.ఉదయ్, జి.వాసు, టి.అప్పలరాజులు ద్వితీయ స్థానం, అలాగే ఎ.జితేంద్ర, బి.బాలాజీ, కె.విజయ్‌లు తృతీయ స్థానం కైవసం చేసుకున్నారని శంకరరావు తెలిపారు. పర్వదినాన్ని పురస్కరించుకుని బాడీ బిల్డర్స్‌లో ఉత్సాహం నింపేందుకు పోటీలు నిర్వహించినట్లు చెప్పారు.

నేడు అండర్–19 బాస్కెట్‌బాల్ జట్ల ఎంపిక

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న అండర్–19 బాల, బాలికల బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా జట్ల ఎంపిక పోటీలు ఈనెల 26న నిర్వహించనున్నట్లు అండర్–19 స్కూల్‌గేమ్స్ అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్‌ఎన్.కృష్ణ బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు నగర శివారులో గల విజ్జీ స్టేడియం ప్రాంగణంలో ఎంపిక పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు ప్రస్తుతం ఇంటర్మీడియట్, 9,10 తరగతులు అభ్యసిస్తున్న 19 సంవత్సరాల వయస్సులోపు క్రీడాకారులు అర్హులుగా పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు ఎంపిక పోటీల్లో పాల్గొనవచ్చని, జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారులు త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

స్కై మార్షల్ ఆర్ట్స్‌లో విద్యార్థినికి బ్లాక్‌బెల్ట్



షణ్ముఖను బ్లాక్ బెల్టుతో సత్కరిస్తున్న స్కై మార్షల్ ఆర్ట్స్ స్టేట్ అధ్యక్ష, కార్యదర్శులు

కొత్తవలస: మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామానికి చెందిన నక్క షణ్ముఖ స్కై మార్షల్ ఆర్ట్స్‌లో బ్లాక్ బెల్ట్ సాధించినట్లు శిక్షకుడు,స్కై మార్షల్ ఆర్ట్స్ జిల్లా ప్రెసిడెంట్ ఎం.త్రినాథరావు బుధవారం తెలిపారు. ఈ నెల 23,24 తేదీల్లో నెల్లూరు జిల్లాలో జరిగిన బెల్టు టెస్టులో షణ్ముఖ ఈ ఘనత సాధించినట్లు పేర్కొన్నారు. షణ్ముఖ దేశపాత్రునిపాలెం గ్రామం సమీపంలో గల ప్రైవేట్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది.

వివాహిత ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన భవాని

బలిజిపేట: వరకట్న వేధింపులు తాళలేక మండలంలోని గంగాడ గ్రామానికి చెందిన పి.భవాని (20) మంగళవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. దీనిపై మృతురాలి తల్లి వరలక్ష్మి ఫిర్యాదు చేసిన మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. గంగాడ గ్రామానికి చెందిన పి.శంకర్‌తో ఏడాది క్రితం నారన్నాయుడువలసకు చెందిన భవాని వివాహం జరిగింది. ఇటీవల ఆమెను అదనపు కట్నం తీసుకురమ్మని భర్త, అత్తింటివారు వేధిస్తుండడంతో మానసికంగా ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడింది.

మరో యువకుడు..



ఉరి వేసుకున్న కన్న పాత్రో

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి పట్టణంలోని రామేశ్వర కాలనీలో ఉంటున్న యువకుడు కన్న పాత్రో(34) బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటనకు సంబంధించి మృతుడి రూమ్ మేట్ కౌలు త్రినాథ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఎల్.దామోదరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రంలోని రౌర్కెలా ప్రాంతానికి చెందిన కన్న పాత్రో గరివిడి పట్టణంలోని బినాపాని ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో త్రినాథ్‌తో కలిసి పని చేస్తున్నాడు. ఒకేచోట పనిచేస్తున్న వారిద్దరూ రామేశ్వర కాలనీలో ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇదిలా ఉండగా కన్న పాత్రో ఒక అమ్మాయిలో ప్రేమలో పడి రోజూ వీడియో కాల్ మాట్లాడేవాడు. అయితే పాత్రో ప్రేమించిన అమ్మాయికి వేరే వ్యక్తితో వివాహం జరగనుందన్న విషయం తెలియడంతో తట్టుకోలేక మనస్తాపం చెంది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గోడ కూలి తల్లీకూతుళ్ల మృతి



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



మృతిచెందిన నారాయణరావు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మండలం నర్సిపురం గ్రామంలో గోడకూలి తల్లీకూతుళ్లు మృతిచెందారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ విషాద సంఘటనకు సంబంధించి పార్వతీపురం రూరల్ ఎస్సై సింహాచలం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన మరిశర్ల సత్తెమ్మ (45), కుమార్తె గంగ(22) సోమవారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా గోడ కూలిపోవడంతో అక్కడికక్కడే మృతిచెందారు. మంగళవారం అందరూ దసరా పండగ సందడిలో ఉండడంతో ఎవరూ వారిని గమనించలేదు. బుధవారం ఉదయం గమనించిన స్థానికులు రూరల్ పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై సింహాచలం తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

మక్కువ: మండలంలోని పెద ఊటగెడ్డ గ్రామంలో నివసిస్తున్న ఈదల నారాయణరావు (41) విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. దీనికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నారాయణరావు స్వస్థలం జియ్యమ్మవలస మండలంలోని డంగభద్రవలస. ఆరేళ్ల క్రితం మక్కువ మండలం పెద ఊటగెడ్డ గ్రామానికి చెందిన అమ్మాజీని వివాహం చేసుకున్న నారాయణ రావు మూడేళ్ల నుంచి అత్తవారి గ్రామంలో ఉంటున్నాడు. ఈనెల 22న పార్వతీపురం మండలం టొంకి గ్రామంలో విద్యుత్ పనులు చేసేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అనసభద్ర గ్రామం సమీపంలో, సాలూరు మండలం తోణాం గ్రామానికి చెందిన ఎ.వెంకటరమణ బైక్‌పై ఎదురుగా వచ్చి ఢీకొనడంతో నారాయణరావు తలకు బలమైన గాయాలయ్యాయి. దీంతో చికిత్స నిమిత్తం విశాఖలోని కేజీహెచ్‌కు తరలించారు. మృతునికి భార్య, ఒకకొడుకు ఉన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.పైడిరాజు తెలిపారు.